సాక్షి కామారెడ్డి

మంగళవారం, 1, అక్టోబర్, 2024



సమస్యల పరిష్కారానికే..

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు.

- 8లో ▸



హామీలను నెరవేర్చాలి

ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు డిమాండ్ చేశారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.7 /22.6

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'సేవలతో ప్రజలకు చేరువవ్వాలి'



నిజాంసాగర్: పోలీసులు సేవలతో ప్రజలకు మరింత చేరువవ్వాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి తక్షణం న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆమె వెంట బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై సుధాకర్ తదితరులున్నారు.

జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బీబీపేట మండలానికి చెందిన పప్పుల రాజేంద్రప్రసాద్ గెలుపొందారు. సోమవారం ఎల్లారెడ్డిలో అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. 185 మంది సభ్యులకుగాను 184 మంది ఓటు వేశారు. ఇందులో పప్పుల రాజేంద్రప్రసాద్‌కు 121 ఓట్లు రాగా, శెనిశెట్టి గౌరీశంకర్‌కు 63 ఓట్లు వచ్చాయి. దీంతో 58 ఓట్ల భారీ మెజారిటీతో రాజేంద్రప్రసాద్ విజయం సాధించారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈనెల 7వ తేదీ వరకు 30, 30ఏ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సింధు శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేనిదే ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

8న డెలివరీ కాని పార్శిళ్ల వేలం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్‌లో చాలాకాలంగా డెలివరీ కాని పార్శిళ్లలోని వస్తువులను ఈనెల 8న వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి బస్టాండ్ ఆవరణలో ఈనెల 8వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి క్రైం: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఓటు హక్కు కోసం సోమవారంనుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. నవంబర్ 6 వరకు దరఖాస్తులకు అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో ఓటు హక్కు ఉన్న వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అయినను లోటే!

- గతనెలలో భారీ వర్షాలు..
- ఉప్పొంగిన వాగులు, అలుగులు పారిన జలాశయాలు
- అయినా ఆశించిన స్థాయిలో పెరగని భూగర్భ జలమట్టం
- గతేడాది సెప్టెంబర్‌లో 7.36 మీటర్ల లోతులో నీరు
- ఈ ఏడాది 9.47 మీటర్ల లోతులో..
- పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్న అధికారులు

గతనెలలో భారీ వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు ఉప్పొంగాయి. చెరువులు అలుగులు పారాయి. ప్రాజెక్టులు కళకళలాడాయి. అయినా భూగర్భ జలాలు మాత్రం ఆశించిన స్థాయిలో పెరగలేదు. గతేడాదితో పోల్చితే సుమారు 2 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి. దీంతో నీటిని పొదుపుగా వాడుకోవాలని భూగర్భ జల వనరుల శాఖ అధికారులు సూచిస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో ఆలస్యంగానైనా భారీ వర్షాలు కురిసినప్పటికీ భూగర్భ జలమట్టం మాత్రం ఆశించిన స్థాయిలో పెరగలేదు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఢోకా లేనప్పటికీ.. యాసంగి పంటల సీజన్‌లో నీటి వాడకం గణనీయంగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురియకపోతే యాసంగిలో సాగు నీటి ఇబ్బందులు తప్పకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో గతేడాది సెప్టెంబర్ నెలాఖరు నాటికి సరాసరి భూగర్భ జలమట్టం 7.36 మీటర్ల లోతులో ఉండగా.. ఈసారి సెప్టెంబర్ నెలఖారున 9.47 మీటర్ల లోతులో నీళ్లున్నాయి. అంటే గతేడాదికన్నా 2.11 మీటర్లు దిగువకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఈ ఏడాది మే నెలలో 14.05 మీటర్ల లోతులో భూగర్భ జలాలుండగా.. జూన్‌లో సరైన వర్షాలు కురియకపోవడంతో 14.46 మీటర్ల లోతుకు పడిపోయాయి. జూలైలో 13.57 మీటర్ల లోతులో, ఆగస్టులో 12.02 మీటర్ల లోతులో నీళ్లున్నాయి. సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో చెరువులు, కుంటలతో పాటు ప్రాజెక్టులు కూడా నిండి వరద గేట్లు ఎత్తారు. అయినా సెప్టెంబర్ మాసంలో 2.55 మీటర్ల మేర మాత్రమే భూగర్భ జలాలు వృద్ధి చెందాయి.

ఈ సీజన్‌లో జిల్లాలో వర్షపాతం వివరాలు..

నెల	వర్షపాతం(మి.మీటర్లలో)
జూన్	128.9
జూలై	305.2
ఆగస్టు	142.2
సెప్టెంబర్	346.8

లింగంపేటలో పుష్కలంగా..

జిల్లాలోని లింగంపేట మండల కేంద్రంలో 0.28 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు ఉండడం గమనార్హం. నిజాంసాగర్ మండలం నర్వలో 0.43 మీటర్లు, తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో 1.01 మీటర్లు, ఫుల్కల్‌లో 1.07 మీటర్లు, నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లిలో 1.30 మీటర్లు, నస్రుల్లాబాద్‌లో 1.52 మీటర్లు, మద్నూర్ మండలం రూసేగావ్‌లో 1.55 మీటర్లు, నిజాంసాగర్ మండలం బూర్గుల్‌లో 1.81 మీటర్లు, మహ్మద్‌నగర్‌లో 1.82 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నట్లు జిల్లా భూగర్భ జల శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

కొన్నిచోట్ల ఇప్పటికీ పాతాళంలోనే...

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ భూగర్భ జలమట్టం పాతాళంలోనే ఉంది. జిల్లాలో సరాసరి భూగర్భ జలమట్టం 9.47 మీటర్లు కాగా.. బిచ్కుంద మండలం పెద్ద దడ్గిలో 29.64 మీటర్ల లోతులో నీళ్లున్నాయి. పిట్లం మండలం గోద్మేగాంలో 27.57 మీటర్లు, దోమకొండ మండలం అంచనూర్‌లో 23.71 మీటర్లు, తాడ్వాయి మండలం కన్కల్‌లో 20.50 మీటర్లు, లింగంపేట మండలం కన్నాపూర్‌లో 20.19 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టం ఉంది. నాగిరెడ్డిపేట మండలం బంజర తండాలో 19.96 మీటర్లు, భిక్కనూరు మండలం మల్లుపల్లిలో 19.78 మీటర్లు, బీబీపేటలో 18.84 మీటర్లు, నాగిరెడ్డిపేట మండలం వదల్‌పర్తిలో 18.15 మీటర్లు, నిజాంసాగర్ మండలం వెల్గనూరులో 17.82 మీటర్లు, కామారెడ్డి పట్టణ పరిధిలోని అడ్లూర్‌లో 16.81 మీటర్లు, తాడ్వాయి మండలం అన్నారంలో 16.55 మీటర్లు, భిక్కనూరు మండలం కాచాపూర్‌లో 15.65 మీటర్లు, ఇదే మండలంలోని పెద్దమల్లారెడ్డిలో 15.50 మీటర్లు, దోమకొండలో 15.52 మీటర్ల లోతులో నీళ్లున్నాయి.

ఆరుతడి పంటలు వేసుకోవాలి



నీరు పుష్కలంగా ఉంది కదా అని బోర్లను పొద్దస్తమానం నడిపిస్తే భూగర్భ జలమట్టం పడిపోయి, యాసంగిలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే విచ్చలవిడిగా కాకుండా పొదుపుగా వాడుకోవాలి. అవసరమైతే యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకోవడం ఉత్తమం. – సతీశ్ యాదవ్, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి, కామారెడ్డి

డీఎస్సీ ఫలితాల వెల్లడి

- జిల్లాలో భర్తీ కానున్న 506 పోస్టులు
- నేటి నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన
- సర్కారు బడుల్లో తీరనున్న టీచర్ల కొరత

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీ–2024 ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. జిల్లాలో వివిధ కేటగిరీలకు సంబంధించి 506 పోస్టులను ఖాళీగా చూపించారు. ఈ పోస్టులకోసం జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు నెలల తరబడి చదివారు. జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యారు. ఆ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి.

భర్తీ కానున్న పోస్టులివే...

జిల్లాలో 506 పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 121, లాంగ్వేజ్ పండిట్ 15 పోస్టులు, పీఈటీ 5 పోస్టులు, ఎస్‌జీటీ 318 పోస్టులున్నాయి. అలాగే ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్లు 11 పోస్టులు, ఎస్‌జీటీ పోస్టులు 36 పోస్టులు భర్తీ చేస్తారు. మొత్తంగా 506 పోస్టులు భర్తీ కానున్నాయి. ఖాళీల భర్తీతో చాలా స్కూళ్లలో టీచర్ల కొరత తీరనుంది.

5వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్..

కామారెడ్డి టౌన్: డీఎస్సీ–2024 అభ్యర్థులకు 1:3 నిష్పత్తిలో మంగళవారంనుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తామని డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ సంతకంతో కూడిన రెండు సెట్ల జిరాక్స్‌లు, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వెరిఫికేషన్ పత్రం, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకుని రావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు డీఈవో కార్యాలయంలో ఆయా పత్రాలను సమర్పించాలని తెలిపారు.

హద్దులు చూపిస్తే.. అడవిని కాపాడుకుంటాం



ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న గౌరారం గ్రామస్తులు



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కలిసిన గౌరారం గ్రామస్తులు

- ఎమ్మెల్యే, అటవీ అధికారులతో గౌరారం గ్రామస్తులు

కామారెడ్డి క్రైం/గాంధారి: రోజురోజుకు అన్యాక్రాంతం అవుతున్న అడవిని చూసి తట్టుకోలేకపోయారు. ఏదైనా చేసి అడవిని కాపాడుకోవాలని నిర్ణయించుకున్నారు. రేంజ్, డివిజన్, జిల్లా స్థాయిలలో ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో ఏకంగా రాష్ట్ర రాజధాని బాట పట్టారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలను అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌తో పాటు తమ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు జిల్లాలోని గాంధారి మండలం గౌరారం గ్రామస్తులు. సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాకేష్ మోహన్ డోబ్రియాల్‌లను వేరువేరుగా కలిశారు. గౌరారం అడవుల్లో ఆరు నెలల కాలంలో సుమారు 150 ఎకరాల అటవీ భూములు అన్యాక్రాంతం అయ్యాయని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కొందరు అడవిని కొద్దికొద్దిగా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. స్థానిక అటవీ అధికారులను పిలిపించి నరికిన చెట్లను చూపించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో హైదరాబాద్ వచ్చి, సమస్యను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువచ్చామన్నారు. సర్వే చేసి తమ ప్రాంతానికి చెందిన అటవీ భూముల సరిహద్దులను చూపిస్తే తామే అడవిని కాపాడుకుంటామని పేర్కొన్నారు. తమ విన్నపానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శంకర్, మాజీ సర్పంచ్ అంజయ్య, మాజీ ఎంపీటీసీ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బేషరతుగా రుణమాఫీ చేయాలి



గాంధారిలో రాస్తారోకో చేస్తున్న అఖిల పక్ష నాయకులు, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

- అఖిల పక్షం డిమాండ్
- గాంధారిలో రాస్తారోకో

గాంధారి: బేషరతుగా అర్హులైన రైతులందరి పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో సోమవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో గాంధారిలో రాస్తారోకో చేశారు. రైతులకు మద్దతుగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డి అమలుకు సాధ్యంకాని హామీలిచ్చారన్నారు. అధికారంలోకి రాగానే హామీలన్నీ మర్చిపోయారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ముఖ్యమంత్రి వెంటనే దిగిపోవాలన్నారు. ఆందోళనలో బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు పోతంగల్ కిషన్ రావు, గాంధారి మాజీ సర్పంచ్ సత్యం, ప్రతిపక్ష నాయకులు రెడ్డి రాజు, సాయిబాబా, మోతీరాం నాయక్, శ్రీకాంత్, శివాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే

- పోక్సో కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరుగుతుంది
- వదంతులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఆరేళ్ల చిన్నారిని వేధించిన సంఘటనలో నిందితుడికి శిక్ష పడాల్సిందేనని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరేళ్ల బాలికను వేధించిన ఘటనపై పోలీసులు సకాలంలో స్పందించి పోక్సో కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందన్నారు. అయినప్పటికీ కొందరు స్కూల్‌కు వెళ్లి అనవసరంగా గొడవ సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్నారు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్న సమయంలో కొందరు అల్లరిమూకలు పోలీసులపై రాళ్లు విసరడంతో పలువురికి గాయాలయ్యాయన్నారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయాలే తప్ప చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం సరికాదన్నారు. ఈ సంఘటనకు కారణమైనవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎస్పీని, ఐజీని అదేరోజు కోరానన్నారు. ఇక్కడ ఎలాంటి కమ్యూనల్ ఇష్యూలేదన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసి, గొడవను పెద్దదిగా చేశారని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కామారెడ్డిలో మతాలకు అతీతంగా కలసిమెలసి ఉంటారన్నారు. తొమ్మిది శాతం ముస్లింలు, 91 శాతం మంది హిందువులు ఉన్నారని, అందరి సహకారం వల్లే తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిని అయ్యానని పేర్కొన్నారు. తాను కాలభైరవస్వామి, లక్ష్మీనర్సింహస్వామి, బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు మరెన్నో ఆలయాల అభివృద్ధికి, సౌకర్యాల కల్పనకు కృషి చేశానన్నారు. ప్రజలకు మంచి జరగాలన్నదే తన ఉద్దేశమని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 185 సీఎం రిలీఫ్ ఫండ్ ఫైల్స్‌ను క్లియర్ చేయించానని, చెక్కుల పంపిణీ విషయంలో పట్టుదలకు పోకుండా స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి అప్పగించానని పేర్కొన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, మండలిలో ప్రతిపక్ష నేతగా పనిచేశానని, ఇప్పుడు ప్రభుత్వ సలహాదారుగా మంచి హోదాలో ఉన్నానని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అంజద్, సందీప్ పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

- జిల్లాస్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై దిశానిర్దేశం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, వేదికపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్ : విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ పనితీరులో స్పష్టమైన మార్పు తెస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామన్నారు. సాంకేతిక కారణాలతో కొంతమందికి రుణమాఫీ జరగనందున, అలాంటి రైతులను గుర్తించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

జిల్లాలో అధిక విస్తీర్ణంలో వరి పంట సాగు చేస్తున్నందున అందుకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను నెలకొల్పాలని, ప్రతి కేంద్రంలోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోకుండా సరిపడా టార్పాలిన్లు సమకూర్చాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరగాలి

వైద్య రంగంలోనూ స్పష్టమైన మార్పు కనిపించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై ప్రజల్లో నమ్మకం పెంపొందేలా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. డెంగీ, విష జ్వరాలు, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అధికారులు కూడా ప్రజలకు జవాబుదారిగా ఉంటూ సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీ పైసా ప్రజల కష్టార్జితం కావడంతో నిధులు వృధా కాకూడదనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నామన్నారు. అర్హులైన రైతులందరికీ త్వరలో రైతు భరోసా అందిస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని మంత్రి జూపల్లి సూచించారు. ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో వసతులను మెరుగుపర్చి నాణ్యమైన బోధన జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. పాఠశాలలకు ఆంగ్ల, తెలుగు దినపత్రికలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు అవార్డులు అందించి ప్రోత్సహించాలని కలెక్టర్‌కు సూచించారు. పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీని అప్‌గ్రేడ్ చేస్తాం

నిజామాబాద్ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని మంత్రి ప్రకటించారు. అదేవిధంగా తెలంగాణ యూనివర్సిటీకి అనుబంధంగా ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌ను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం చదువుకునే అభ్యర్థులకు భోజన వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశానికి ముందు మంత్రి నగరంలో రూ.6 కోట్లతో నిజామాబాద్ నుంచి నర్సీ రోడ్డు మరమ్మతులు, రూ. 4.50 కోట్లతో నిజామాబాద్ – వర్ని రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న హిందూసంఘాల ప్రతినిధులు

- హిందూ సంఘాల డిమాండ్
- జిల్లాకేంద్రంలో ధర్నా

కామారెడ్డి టౌన్: దేవాలయ వ్యవస్థను నిర్వహించడానికి, హిందూ ధర్మ పరిరక్షణకు ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలని హిందూ సంఘాలు డిమాండ్ చేశాయి. విశ్వహిందు పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద హిందూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ పీఠాధిపతులు, స్వామీజీలు, అధ్యాత్మిక, సామాజిక వేత్తలతో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ శాఖను రద్దు చేయాలని, ఆలయాల్లో అన్యమత ఉద్యోగస్తులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. తిరుమల లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి, అక్కడ నిరసన తెలిపారు. కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ప్రతినిధులు రాజు, గంగారెడ్డి, విశ్వనాథం, గోపాలకృష్ణ, జూలూరి సుధాకర్, రాజు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రారంభం

బాన్సువాడ : ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. నవంబర్ 1 నాటికి ఉత్తీర్ణులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదుకు దరఖాస్తు ఫారం పూర్తి చేసి ఆయా తహసీల్ కార్యాలయాల్లో గాని, ఆన్‌లైన్ ద్వారా గాని దరఖాస్తులు చేసుకోవచ్చునని సూచించారు.

పౌరులు తమ హక్కులను పొందాలి



రాజంపేట : సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి సంధ్యారాణి అన్నారు. సోమవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ అనిల్ కుమార్ అధ్యక్షతన మండలంలోని సిద్దాపూర్ అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడం బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓ కె రాజేశం, ఆర్ఐ ముజుబుద్దీన్, కార్యదర్శి వంశీ, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



మాచారెడ్డి : పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం కోసం గ్రామస్తులు రూ 10 వేల విలువైన పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు పుస్తకాలు అందజేసిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మాచారెడ్డి విద్యార్థినులు



మాచారెడ్డి(కామారెడ్డి) : మెదక్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 6న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం ఎస్ వెంకటాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 విభాగంలో ఖోఖో పోటీలకు 10వ తరగతి విద్యార్థిని ఆశ్విత, అండర్–14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని రిషిక ఎంపికైంది. ఫుట్‌బాల్ పోటీలకు 10వ తరగతి విద్యార్థిని తేజస్విని ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. హెచ్ఎంతో పాటు పీఈటీ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సీఆర్పీ సంజీవ్ అభినందించారు.

కవి ఉమాశేషారావుకు సన్మానం

కామారెడ్డి రూరల్ : పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో సోమవారం కవి సమ్మేళనం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కవి ఉమాశేషారావు వైద్యను సన్మానించారు. శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు తుమ్మ రాంచంద్రం, బాల్‌రాజ్‌గౌడ్, అవధాని తదితరులున్నారు.

వయోవృద్ధులను గౌరవించాలి

కామారెడ్డి రూరల్ : వయోవృద్ధులను ప్రతిఒక్కరూ ఆదరించాలని సెక్టార్ సూపర్‌వైజర్ కొమురవ్వ సూచించారు. సోమవారం కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డ్ లింగాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. టీచర్ ఉమారాణి, లలిత, కల్పన, పద్మ, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు పాల్గొన్నారు.

నాగన్నగారి బావికి పర్యాటకుల తాకిడి



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని నాగన్నగారి బావిని పిట్లం విద్యార్థులు సందర్శించారు. నాగన్నగారిని పునరుద్ధరించడంతో నిత్యం పర్యాటకులు సందర్శిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు, పలు మండలాలకు చేందిన పర్యాటకులు సందర్శించారు. లింగంపేటలోని ప్రసిద్ధి చెందిన నగరేశ్వర ఆలయం ముందు గాలికి ఊగే ధ్వజస్తంబాన్ని సందర్శిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి వినతులు



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రజావాణి ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు విచారణ జరపాలన్నారు. వినతులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీఓ సురేందర్, జడ్పీ సీఈఓ చందర్ నాయక్, డీపీఓ శ్రీనివాస్‌రావు, ఏఓ మసూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్వింటాలుకు రూ.300 కమీషన్ ఇవ్వాలి

రేషన్ డీలర్లకు క్వింటాలు బియ్యానికి రూ. 300 కమీషన్ ఇవ్వాలని జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం వారు ప్రజావానిలో వినతి పత్రం అందజేవారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రేస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కమీషన్ పెంచాలన్నారు. రూ.10 లక్షల భీమా సౌకర్యం, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. దిగుమతి హమాలీని ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్‌లలో ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ వే బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. ఏరియర్స్‌ను విడుదల చేయాలన్నారు. చనిపోతే దహన సంస్కారాలకు రు.50 వేలు ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు.

డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే చేయలేం

డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే నుంచి తమను తప్పించాలని కోరుతూ టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో జిల్లాలోని వ్యయసాయ విస్తీర్ణాధికారులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యాప్ ద్వారా డిజిటల్ క్రాప్ బుకింగ్ చేసే పనులు అప్పగించిందన్నారు. ఈ సర్వే చేయడానికి ఒక్కో ఏఈవో తన పరిధిలోని దాదాపు 7–8 వేల ఎకరాల వ్యవసాయ భూముల్లో క్షేత్రస్థాయి పర్యటన చేయాల్సి ఉంటుందన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పార్ట్‌టైం స్వీపర్లుగా పని చేస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణికి తరలివచ్చారు. 20 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న తమకు రూ.5,200 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రజావాణిలో అందజేశారు.

'జల సంరక్షణ పనుల నివేదికలు సిద్ధం చేయాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లాలో నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంపొందించే పనులకు సంబంధించిన పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8 నుంచి 10 వరకు జిల్లాలో జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటించనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నీటి సంరక్షణ, భూగర్భ జలాలను పెంపొందించే పనులు, ప్లాంటేషన్‌లకు సంబంధించి పూర్తి చేసిన, చేపట్టాల్సిన పనులను గుర్తించాలన్నారు. వాటికి సంబంధించిన పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, జెడ్పీ సీఈవో చందర్, డీపీవో శ్రీనివాస్‌రావు, భూగర్భ జల శాఖ అధికారి సతీశ్, డీఏవో తిరుమల ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సుజాత, పీఆర్ ఈఈ దుర్గాప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

బీబీపేట: రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని వారి కోసమే ప్రభుత్వం ఉందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం వార్షికాదాయం, మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24లో చేసిన ఖర్చులు, ఆదాయం వివరాలను సీఈవో నర్సాగౌడ్ రైతులకు చదివి వినిపించారు. మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ బీబీపేట మండలానికి చెందిన శేరి బీబీపేట, ఇస్సానగర్ గ్రామాలకు చెందిన రైతులకు సరిహద్దులో ఉన్నటువంటి సిద్దిపేటలో వ్యవసాయ భూములు ఉండడం వల్ల వారికి రుణాలు ఇవ్వడం లేదని వారికి ఇచ్చే విధంగా తీర్మాణం చేయాలని తెలిపారు. సొసైటీ బియ్యాన్నే పాఠశాలలు, హాస్టళ్లలోకి పంపిణీ చేయాలన్నారు. ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు రంగోలు శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు



బాన్సువాడలో టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు చేస్తున్న జిల్లా అధ్యక్షులు వెంకట్‌రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడలో సోమవారం టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు నారాల వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుందరూ టీఎన్జీవోస్‌లో సభ్యత్వం తీసుకోవాలన్నారు. సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో బాన్సువాడలో టీఎన్జీవోస్ భవనం నిర్మించుకున్నామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కరం కోసం టీఎన్జీవోస్ కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ప్రతినిధులు వెంకట్, తుల శ్రీనివాస్, చిట్టింపల్లి రవి తదితరులు ఉన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పరామర్శ



బాన్సువాడ : రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సోమవారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. మంత్రి తండ్రి నలమాద పురుషోత్తమ్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసిన పోచారం ప్రగాఢ సానుభూతి తెలిపారు. పురుషోత్తమ్‌రెడ్డి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్వయం పాలనా దినోత్సవం..



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధన చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ సలాం బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ జయకుమారి విద్యార్థులను అభినందించారు.

జీపీ ఎదుట ఆందోళన



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని సంగం గ్రామంలో డబుల్ ఇళ్లలో ఉన్న ప్రజలకు ఓటరు నమోదులో అవకతవకలు జరిగియాని సోమవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. రెవెన్యూ లెక్కల ప్రకారం సంగం గ్రామం నుంచి సంగం(ఏ) నూతన పంచాయతీ ఏర్పడింది. దీంతో ఎస్టీలందరికీ ఓ గ్రామ జీపీగాను.. బీసీ, ఎస్టీ, మైనార్టీలు ఓ జీపీగా ను ఏర్పడాలని గ్రామస్తులు తీర్మానించారు. కాని అలా జరగలేదు. జీపీ కార్యదర్శి అనిల్‌ను వివరణ కోరగా నవంబర్‌లో ఫాం–8 తీసుకుని మార్పులు చేర్పులు చేస్తామని తెలిపారు.

ఆస్పత్రి బాత్రూమ్‌లో రోగి ఆత్మహత్య

- వ్యాధి నయం కావడం లేదనే మనస్తాపంతో..



సాయిలు (ఫైల్)

కామారెడ్డి క్రైం: వ్యాధి నయం కావడం లేదనే మనస్తాపంతో చికిత్స పొందుతున్న ఆస్పత్రిలోని బాత్రూమ్ లోనే ఓ పేషంట్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవదాన్ ప్రయివేట్ ఆస్పత్రిలో సోమవారం వేకువజామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండల కేంద్రానికి చెందిన లింగాల సాయిలు (45) కొద్ది రోజులుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చేతికి తగిలిన గాయం ఇన్ఫెక్షన్ కావడంతో వారం రోజుల క్రితం కామారెడ్డిలోని ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. వైద్యం అందించి సెప్టెంబర్ 25 న డిశ్చార్జ్ చేశారు. ఇన్‌ఫెక్షన్ తిరగబడటంతో సెప్టెంబర్ 29 న వచ్చి మళ్లీ అడ్మిట్ అయ్యాడు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో బాత్రూమ్‌కు వెళ్లిన సాయిలు టవల్‌తో కొక్కానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో అతని భార్య, ఇతర కుటుంబ సభ్యులు కూడా ఆస్పత్రిలోనే ఉన్నారు. ఘటన జరిగిన సమయంలో అక్కడున్న వారంతా నిద్రలో ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని మైసమ్మ చెరువులో ప్రమాదవశాత్తు పడి అవుటివార్ హులరాం(35) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుకా కూతుమాపూర్ గ్రామానికి చెందిన అవుటివార్ హులరాం కొద్దిరోజులుగా మద్నూర్‌లోని తన అక్క హుల్లుబాయి ఇంట్లో ఉంటున్నాడు. గతనెల 28వ తేదీన సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు మైసమ్మ చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులోపడి మృతి చెందాడు. చెరువులో మృతదేహం ఉన్నట్లు సోమవారం సమాచారం అందిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోచారం ప్రధాన కాలువలో మునిగి..



గోరుకుల లక్ష్మణ్(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేటకు చెందిన గోరుకుల లక్ష్మణ్(23) అనే యువకుడు ప్రమాదవశాత్తు పోచారం ప్రధాన కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల 28న తన అమ్మమ్మ మరణించడంతో అంత్యక్రియలకు హాజరైన లక్ష్మణ్ స్నానం చేసేందుకు పోచారం ప్రధాన కాలువ వద్దకు వెళ్లాడు.


ఆ తరువాత ఇంటికి రాకపోవడంతో లక్ష్మణ్ ఆచూకీ కోసం కుటుం సభ్యులు వెతికారు. మూడు రోజుల తరువాత సోమవారం ఉదయం లక్ష్మణ్ మృతదేహం గోపాల్‌పేట గ్రామసమీపంలోని కాలువలో కనిపించింది. తన కొడుకు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడని మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

నాటుతుపాకీ స్వాధీనం



ఎల్లారెడ్డి: రేంజ్ పరిధిలోని లక్ష్మాపూర్‌లో నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ అధికారి ఓంకార్ సోమవారం తెలిపారు. గ్రామంలోని ఓ వ్యక్తి వద్ద నాటు తుపాకీ ఉన్నదనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నాటుతుపాకీని పోలీసులకు అందజేశామన్నారు. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు శ్రీనివాస్ నాయక్, పృథ్వీరాజ్, సెక్షన్ ఆఫీసర్ విక్కీ మార్టిన్, బీట్ ఆఫీసర్ పిచ్చమ్మ పాల్గొన్నారు.

3.2కిలోల గంజాయి పట్టివేత



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని శివాపూర్ చౌరస్తాలో ఎక్సైజ్ పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద 3.2కిలోల ఎండు గంజాయితో పట్టుబడ్డాడు. పోచారం తండాకు చెందిన బర్దావాల్ గోబీర్య అనే యువకుడు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడని అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింఇనట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై నగేశ్, సిబ్బంది శ్రీధర్, సందీప్ రెడ్డి, శ్రీకాంత్, అనిత పాల్గొన్నారు.

కబ్జాదారులపై కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్ర భూమిని కబ్జా చేసిన నలుగురిపై సోమవారం కేసునమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. నాగిరెడ్డిపేటకు చెందిన పోచయ్య, విజయ్, భూమయ్య, నాగరాజు విత్తనక్షేత్రం సర్వే నం.834లో ని ప్రభుత్వ భూమిలో 4ఎకరాల భూమిని దున్ని, వరినాట్లు వేశారని క్షేత్రం ఏడీఏ హరివెంకటప్రసాద్ ఫిర్యాదు చేశారన్నారు.

డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు



షిండే సచిన్



గొండ రవీందర్



దీక్షిత్ కుమార్



ప్రమోద



వెంకటేశ్



ఆనంద్‌కుమార్



గడ్డమీది సంజీవ్

గాంధారి(ఎల్లారెడ్డి) :డీఎస్సీ ఫలితాలు సోమవారం విడుదల చేయగా జిల్లాలోని గాంధారి యువకుడు షిండె సచిన్ ఇంగ్లిష్ ఎస్ఏలో జిల్లాలో ఫస్ట్‌ర్యాంక్ సాధించాడు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : పెద్దకొడప్‌గల్ మండల కేంద్రానికి చెందిన గొండ రవీందర్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ జిల్లాలో ఫస్ట్‌ర్యాంక్ సాధించాడు. దీంతో యువకుడి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

బీబీపేట : జనగామ గ్రామానికి చెందిన ఎస్జీటీ టీచర్ శక్కర దీక్షిత్‌కుమార్ స్కూల్ అసిస్టెంట్ బయోలజికల్ సైన్స్‌లో జిల్లాలో ఫస్ట్‌ర్యాంక్ సాధించాడు. ఈయన ఉప్పర్‌పల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నాడు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన కోలపల్లి ప్రమోద ఒకే డీఎస్సీలో రెండు ఉద్యోగాలను సాధించారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో జిల్లాలో 2వ ర్యాంకు, ఎస్జీటీలో జిల్లాలో 13వ ర్యాంకు సాధించి రెండు ఉద్యోగాలను సాధించారు. ప్రస్తుతం ఈమె నాందేడ్‌లో ఈఎస్ఐసీ సెంట్రల్‌లో ఉద్యోగం చేస్తుండగా, గ్రూప్–4లో కూడా 1:3లో ఎంపికైనట్లు తెలిపారు.

ఎలారెడ్డి రూరల్ : మండలంలోని లింగారెడ్డిపేటకు చెందిన కో పుచింతల వినోద్‌కుమార్ డీఎస్సీలో జిల్లా స్థాయిలో ఎస్జీటీలో 7వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించాడు. తల్లి కిష్టవ్వ కష్టానికి తగిన ఫలితం పొందానని వినోద్ హర్షం వ్యక్తం చేశాడు.

చుక్కాపూర్ వాసికి..

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన అక్కెం వెంకటేశ్ జిల్లాస్థాయిలో మూడో ర్యాంక్ సాధించాడు. 85.77మార్కులు సాధించి మూడో ర్యాంక్ సాధించిన వెంకటేష్ ను గ్రామస్తులు అభినందించారు.

బాన్సువాడ రూరల్ : సోమవారం ప్రకటించి డీఎస్సీ ఫలితాల్లో బోర్లం గ్రామానికి చెందిన జోగొల్ల ఆనంద్‌కుమార్ పీఈటీ ఫలితాల్లో జిల్లా రెండవ ర్యాంక్ సాధించాడు. గ్రామ యువకులు, నాయకులు ఆనంద్‌ను అభినందించారు.

రాజంపేట : రాజంపేట గ్రామానికి చెందిన గడ్డమీది సంజీవ్ ఎస్జీటీలో 76.67 మార్కులు సాధించి 98 ర్యాంకు సాధించాడు. గ్రామస్తులు సంజీవ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు



ఎల్లారెడ్డిలో బతుకమ్మలతో విద్యార్థినులు



భిక్కనూరులో సిద్దార్థ విద్యాలయంలో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న బాలికలు

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబురాలను మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో బతుకమ్మలను అందంగా తయారుచేసి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జంగంపల్లిలో బతుకమ్మలతో మహిళలు



లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న మహిళలు



బీబీపేట కస్తూర్బా పాఠశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుతున్న ఉపాధ్యాయులు

మురికికాలువలో పూడికతీత

సాక్షి ఎఫెక్ట్..



మురికికాలువలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలకేంద్రం గోపాల్‌పేటలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మురికికాలువ ధ్వంసమై రోడ్డుపై మురికినీరు పారుతుండడంతో జీపీ అధికారులు స్పందించి మురికికాలువలో పూడికను తీయించారు. మురికికాలువ ధ్వంసమై రోడ్డుపై మురికినీరు పారుతున్న విషయమై 'సాక్షి' లో సోమవారం 'రోడ్డుపైనే పారుతున్న మురుగు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, గోపాల్‌పేట పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య గ్రామంలో రహదారి విస్తరణపనుల్లో భాగంగా ధ్వంసమైన మురికికాలువలో నుండి జేసీబీ ద్వారా పూడికను తొలగింపజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బాన్సువాడ : పట్టణంలోని కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల(2003 – 04 బ్యాచ్)ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రామకృష్ణారెడ్డి, రూపను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు బత్తిని సుకన్య, రజిత, స్వాతి, శ్వేత, కల్పన, సవిత, శ్రీనివాస్, పవన్, దత్తు, సాయిరాం, సురేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వాతలు పెట్టిన తల్లి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన స్కూలు ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్



తల్లి వాతలు పెట్టడంతో ముఖం, చేతులపై కాలిన గాయాలతో చిన్నారులు

కామారెడ్డి టౌన్: కన్నతల్లే తన పిల్లలపై కర్కశంగా వ్యవహరించిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని బడాకసాబ్ గల్లిలో నివాసం ఉంటున్న ఓ మహిళకు ముగ్గరు సంతానం. వీరిలో చిన్నవాడైన మూడేళ్ల బాలుడు ముదాంగల్లిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల అవరణలోని అంగన్‌వాడిలో చదువుతుండగా, మిగతా ఇద్దరు బాలికలు అదే పాశాలలో 2, 4వ తరగతి చదువుతున్నారు. అయితే బాలుడితో పాటు 2వ తరగతి చదువుతున్న బాలికకు ఆదివారం తల్లి పొయ్యిలో నుంచి కర్ర తీసి ముఖం, చేతులపై వాతలు పెట్టి గాయపరిచింది. సోమవారం స్కూల్‌కు వచ్చిన పిల్లల ముఖం, చేతులపై కాలిన గాయాలను గమనించిన ఉపాధ్యాయులు, హెచ్ఎం వివరాలు అడిగి తెసుకున్నారు. వెంటనే తల్లిని స్కూల్‌కు పిలిపించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిల్లలు ఇంట్లోని దేవుడి వద్ద డబ్బులు తీయడంతో అలా చేసానని, మరోసారి చేయనని ఆమె అందరినీ వేడుకుంది. పోలీసులు, ఉపాధ్యాయులు మహిళ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. అయితే చిన్నారులను గాయపర్చిన ఘటనలో మహిళతో పాటు మరో వ్యక్తి ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.